క్లుప్తంగా

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్



గట్టు: అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన తరుణంలో ముందస్తుగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో 30 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలంటూ చలో అసెంబ్లీకి పిలుపు నిచ్చారు. యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



అయిజ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం ఆర్‌బీఎస్‌కే టీం వైద్య పరీక్షలు నిర్వహించింది. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు సవిత, రాఘవేంద్ర మాట్లాడారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత, ప్రిన్సిపాల్ రాములు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక తరలింపు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సమీపంలో శ్రీరామ్ నగర్ కాలనీలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను ఇటీవల రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. ఈ ఇసుకను శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సాతర్ల చేపట్టిన మన ఊరు – మన బడి పనుల కోసం తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పెద్ద ధన్వాడ చెందిన రాజ్ కుమార్ స్థానికంగా ఉన్న తుంగభద్ర నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించగా, గ్రామ శివారులో ఇసుక లోడ్‌తో ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుర్మయ్య తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శాంతినగర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మద్దూరు సమీపంలోని తుంగభద్ర నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మద్దూరు స్టేజి, శాంతినగర్ సమీపంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఇద్దరికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై కర్నూల్ వైపు వెళ్తున్న బైక్‌ను గుర్తు తెలియని ఆటో ఢీ కొంది. శనివారం జాతీయ రహదారిపై అలంపూర్ మండలం బుక్కాపురం చెందిన శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి మానవపాడు మండలం పెద్ద ఆముదాలపాడు వెళ్లి వస్తుండగా ఉండవెల్లి శివారులో గుర్తు తెలియని ఆటో ఢీ కొంది. బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలు కాగా, వారిని అంబులెన్స్‌లో కర్నూల్ తరలించారు.

కేబుల్ వైర్ల చోరీ

ధరూరు: వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. మండలంలోని జాంపల్లి శివారులోని నెట్టెంపాడు కెనాల్ వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన వైర్లను జనవరి 7న గుర్తు తెలియని దుండగులు 20 మంది రైతుల మోటార్ల కేబుల్ వైరును ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రి 10 మోటార్ల వైరును దొంగతనం చేసినట్లు రైతులు తెలిపారు. దొంగతనాలతో రైతులు బెంబేలెత్తున్నారు.

యువత భవిష్యత్ అంధకారం

- జనవరిలో ఐదు పోక్సో కేసులు నమోదు
- సామాజిక మాధ్యమాల తీవ్ర ప్రభావం
- ఆందోళనలో తల్లిదండ్రులు

గద్వాల క్రైం: పిల్లల్లో మార్పు రావాలి ఉన్నతహోదాలో ఉండాలని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలనే ఆశలో తల్లిదండ్రులు ఏ కష్టం రాకుండా వారిని పెంచి పోషిస్తారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ పిల్లలకు కావాల్సిన వసతులు, మౌలిక సదుపాయాలు కలిప్తిస్తున్నారు. అయితే కౌమార దశలోనే అరచేతిలో మొబైల్‌ఫోన్‌కు దాసోహమై వారి భవిష్యత్‌ను ప్రమాదకరమైన ఊబిలో నెడుతున్నారు. జిల్లాలో జనవరి మాసంలో ఐదు పోక్సో కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా ఇంటర్, పదో తరగతి చదువుతున్న మైనర్లే ఉండడం, లైంగికదాడికి గురికావడం వంటి సంఘటనలు ఉన్నాయి.



జిల్లా కేంద్రంలో విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న షీ టీం (ఫైల్)

చోటు చేసుకున్న సంఘటను

■ జనవరి 27న జిల్లా కేంద్రంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ విద్యాభాసం చేస్తుంది. తల్లి హైదరాబాద్‌లోని కూలీ పనులు చేస్తు తన కుతురిని చదివిస్తుంది. ఈ క్రమంలో నిర్వహకుడి బంధువైన ఓ యువకుడు విద్యార్థినితో ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. తనతో శారీరకంగా కలవాల్సిందిగా విద్యార్థిని ఒత్తిడి చేశాడు. ఈ విషయం తల్లికి ఆ విద్యార్థిని చెప్పడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి 29వ తేదీన రిమాండ్‌కు తరలించారు.

■ 27వ తేదీన జిల్లా కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఈ పరిచయం వారిని తరచూ ఫోన్‌ల్లో మాట్లాడే వరకు దారి తీసింది. కొన్నిసార్లు వీడియో కాల్స్‌లో ఇద్దరు మాట్లాడుకోగా, తర్వాత నిరాకరించింది. అయితే యువకుడు తనతో వీడియోకాల్ మాట్లాడాల్సిందిగా ఒత్తిడికి గురి చేశాడు. లేదంటే తనతో మాట్లాడిన క్రమంలో స్క్రీన్ షాట్ తీసిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తానని బెదిరించాడు. ఆందోళనకు గురైన విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 31వ తేదీన పోలీసులు అదుపులోకి తీసుకుని యువకుడిని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

■ 20వ తేదీన అయిజ మండల కేంద్రంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వెంటాపడుతూ వేధింపులకు గురిచేశాడు. విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసుకుని ఆ విద్యార్థిని జువైనల్ స్టేట్ హోంకు తరలించారు.

■ 31వ తేదీన రాజోలి మండల కేంద్రంలో ఐదేళ్ల చిన్నారిని 35ఏళ్ల వ్యక్తి ఓ ఇంట్లోకి తీసుకెళ్లి భయభ్రాంతులకు గురి చేశాడు. గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తిపై పోక్సో కేసు పోలీసులు నమోదు చేశారు. ఇలా జిల్లాలో నిత్యం పోక్సో కేసులు నమోదు కావడం సమస్యగా మారింది. కొన్ని సంఘటనలు వెలుగులోకి రాని ఉన్నాయి.

సామాజిక మాధ్యమాల్లోనే అధిక సమయం..

చదువుకోవాల్సిన సమయంలో విద్యార్థులు మొబైల్‌ఫోన్‌లో కాలం గడుపుతున్నారు. వాటిలో వచ్చే సందేశాలు, స్నేహితులతో కాలక్షేపం చేస్తున్నారు. తరచూ వీడియోకాల్స్ ద్వారా మాట్లాడుకోవడం వంటి వ్యసనంలో ఉంటున్నారు. ఇంటర్‌నెట్‌లో వచ్చే అశ్లీల దృశ్యాలు, కౌమారదశలో వచ్చే మార్పులకు వారు బలహీనులైపోతున్నారు. చిన్నారుల్లో సైతం తెలియని చెడు అలవాట్లకు దగ్గరవుతున్నారు. మంచి పలకరింపు, బాగోగులు చూడాల్సిన క్రమంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా ఉండడం ఇందుకు ప్రధాన సమస్యగా మారింది. అయితే కుటుంబంలో గొడవలు, ఆర్థిక సమస్యలు ఇలా అనేక సంఘర్షణలతో కుటుంబ సభ్యులు సతమతం అవుతున్నారు. పిల్లలు ఏం చేస్తున్నారు. ఎలాంటి విషయాల్లో చురుకుగా ఉంటున్నారు. సంప్రదాయాలు, కట్టుబాట్లు, మానవీయ అంశాల విశ్లేషణ తదితర విషయాలు మచ్చుకైనా వారికి తల్లిదండ్రులకు చెప్పకపోవడం సమస్యగా మారింది. పలు కారణాల రీత్యా పిల్లలపై సమయం కేటాయించకపోవడం వల్లనే దారుణాలకు దారి తీస్తున్నాయని నిపుణులు వివరిస్తున్నారు.

మార్పుతో సాధ్యం: సృజన, ఎస్పీ



ప్రస్తుత పరిస్థితిలో మార్పు ఎంతో అవసరమో అంతే జాగ్రత్త కూడా అవసరం. విద్యార్థులు తప్పు చేస్తున్నారంటే వారిలో ఏదో వెలతి ఉన్నట్లే. వారికి కావాల్సిన సదుపాయాలు అందజేయడంలో తీసుకుంటున్న శ్రద్ధ వాటిని ఎలా వినియోగిస్తున్నారో చూడాల్సిన బాధ్యత మనపై ఉంది. పోక్సో కేసుల విషయంలో చట్టరీత్యా చర్యలు ఉంటాయి. ప్రతి పాఠశాల, కళాశాల దశలో చెడు వ్యసనల వైపు ఆకర్షితులు కాకుండా వారికి పలు అంశాలను తల్లిదండ్రులు వివరించాలి. పోలీసుశాఖ పరంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సదస్సులు, కళాజాతాచే చైతన్యం కల్పిస్తాం. మైనర్లపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తులు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదు.

పండుగ వాతావరణం

పూజలు, హోమాలతో జిల్లా కేంద్రం కళకళ

గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని భూలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు, జమ్ములమ్మ దేవతను కొలిచేందుకు వస్తున్న భక్తుల తాకిడితో శనివారం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా భక్తుల కోలాహలం కనిపించింది.

చెన్నకేశవునికి అభిషేకం..

వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళకర ప్రత్యేక వాయిద్యాల మధ్య మంత్రాలయ రాఘవేంద్ర స్వామి సన్నిధిలోని కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు వేద పండితులు అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను వీక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం, కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా తెప్పోత్సవం

చెన్నకేశవస్వామి ఉత్సవాలలో భాగంగా సంస్థానాధీశుల కాలంనాటి లింగంబావిలో ఏర్పాటు చేసిన స్వామివారి తెప్పోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్త జన సందోహంతో పట్టణం పులకించింది. శనివారం రాత్రి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి వైభవంగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. మొదట ఆలయం ప్రాంగణంలో శేషవాహనంపై స్వామివారిని ఊరేగించారు. సుందరంగా అలంకరించిన లింగబావిలో నిర్వహించిన స్వామివారి తెప్పోత్సవం వేడుకల్లో పాల్గొని భక్తులు తరించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి తెప్పోత్సవంలో పాల్గొన్నారు.



తెప్పోత్సవం నిర్వహిస్తున్న పండితులు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

హై కోర్టు న్యాయమూర్తుల పూజలు

హై కోర్టు న్యాయమూర్తులు నంద, నాగార్జున, జిల్లా జడ్జి కనకదుర్గ భూలక్ష్మీ చెన్నకేశవస్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవాన్ని తిలకించారు.

వీధి సమావేశాలు విజయవంతం చేయండి

గద్వాల న్యూటౌన్: జిల్లాలోని 200 శక్తి కేంద్రాల్లో ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే వీధి సమావేశాలను (కార్నర్ మీటింగ్స్) శ్రేణులు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాలకు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో దాదాపు 50లక్షల మంది పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశాల ద్వారా పార్టీ మరింత పటిష్టం అవుతుందన్నారు. సమావేశంలో గడ్డం కృష్ణారెడ్డి, స్నిగ్ధారెడ్డి, అశోక్, రామాంజనేయులు, తిరుమల్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, కిష్టన్న, కేకేరెడ్డి, లక్ష్మణ్, రాజ్‌గోపాల్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

ఆత్మగౌరవం కోసం వచ్చిందే కేవీపీఎస్



డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజోళి: కుల వివక్షతో ప్రజల మధ్య వ్యత్యాసాన్ని రూపుమాపి, కుల మతాలకు సంబంధం లేకుండా అందరి సమానత్వం కోసం, హక్కులను కాపాడటం కోసం ఆవిర్భవించిందే కేవీపీఎస్ అని నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట డైరీని ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ.. ఆత్మగౌరవం, సమానత్వం నినాదంతో పుట్టి, ఎవరికి అన్యాయం అయినా వారి తరపున పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, ఎస్ఐ కుర్మయ్య, ఉప సర్పంచ్ గోపాల్, విజయ్‌కుమార్, రామకృష్ణ, గజేంద్రుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగ నిరోధక టీకాలు వేయించండి

అయిజ: బ్రుసెల్లోసిస్ వ్యాధి రాకుండా ఆడ దూడలకు రోగ నిరోధక టీకాలు వేయించాలని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి సూచించారు. శనివారం మండలంలోని ఎక్లాస్‌పురం, ఉప్పలలో ఆడ దూడలకు టీకాలు వేశారు. అన్ని గ్రామాల్లోని 4 నుంచి 8 నెలల వయసున్న దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్‌ను ఒకసారి వేయడం వలన జీవితకాలం వ్యాధి రాకుండా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ గిడ్డయ్య, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: వ్యాక్సిన్‌తో పశువులకు వ్యాధులు దూరమవుతాయని పశువైద్య సిబ్బంది మోహన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సిద్దన్‌పల్లితండాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బ్రుసెల్లోసిస్ వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ, గోపాలమిత్రలు గోపాల్‌రెడ్డి, భీమయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సిద్ధన్‌పల్లితండాలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కూలీలకు సరైన వసతులు కల్పించాలి



చాగాపురంలో సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సరైన వసతులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్ డిమాండ్ చస్తశారు. శనివారం ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పనుల వద్ద కూలీలకు తాగునీరు, టెంట్లు, వైద్యం వంటి సుదుపాయాలను ఖచ్చితంగా కల్పించాలని అన్నారు. అలాగే జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి 200 రోజుల పని దినాలను కల్పించాలన్నారు. ప్రతి రోజు రూ.600 కూలీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవదాస్, కేశన్న, శేషన్న, శేఖర్, రత్నం, తదితరులు ఉన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి

అయిజ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో చేపట్టిన వెజ్, నాన్‌వెజ్ భవనం పనులను ఏఈ గోపాల్‌తో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనుల్లో భాగంగా మొక్కలు నాటేందుకు మార్కింగ్ వేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం

గద్వాల అర్బన్: జిల్లాలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సతీష్ అన్నారు. బీసీ, ఎస్సీ పాఠశాల, కళాశాల వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వసతిగృహాల్లో శాశ్వత వార్డెన్లను నియమించాలని, విద్యార్థులకు అనుగుణంగా నూతన భవనాలను కేటాయించాలని, నాణ్యమైన భోజనం అందించాలని, వసతిగృహాల్లో సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, సురేష్, రఘువంశీ, శ్రీకాంత్, గణేష్, ఓంకార్, మహేష్, అనిల్, సుమతి, స్రవంతి, అశ్విని, మంజుల పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఉప కేంద్రం పక్కన విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని శనివారం ఏడీ చిన్న మగ్బుల్ ప్రారంభించారు. ప్రతి గ్రామంలో ఇలాంటి సదుపాయాలు ఉంటే ప్రజలు సానుకూలంగా స్పందిస్తారని తెలిపారు. విద్యుత్ బిల్లులను నెలలో 15 రోజుల సమయంలో వసూల్ చేయడానికి రిటైర్డ్ హెచ్ఎం సవారన్న కుమారులు ప్రత్యేకంగా గది నిర్మించి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఈ అహ్మద్, సుబ్బారాయుడు, శరత్ కుమార్, హంపన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పథకాలు ఆదర్శం

గద్వాల అర్బన్: దివంగత రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పెదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని వైఎస్సార్‌టీపీ అసెంబ్లి కోఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లిలో 30మంది పార్టీలోకి చేరారు. ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. వైఎస్సార్ నిరుపేదల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్ సంక్షేమ పాలన రావాలంటే అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు అండగా ఉండాలని చెప్పారు. పార్టీని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనుస్, అంజి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అతికూర్ రహ్మాన్

వర్గీకరణ బిల్లు ఆమోదింపజేయాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) నాయకులు శనివారం కొండేరులో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి మంద జగన్నాథంకు వినతిపత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించి పార్లమెంట్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాందాస్, పరమేశ్వర్, జాన్ తదితరులు ఉన్నారు.

కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయం

అయిజ: పట్టణంలోని రంగుపేటలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కల్యాణోత్సవానికి భక్తులు వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో తరలివచ్చేందకుకు అవకాశం ఉండడంతో అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. రాత్రి కుంకుమార్చన నిర్వహిస్తామని, తీర్థ ప్రసాదాలతోపాటు భక్తులకు భోజన వసతి కల్పిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.



ముస్తాబైన మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

ప్రారంభమైన ఉత్సవాలు



అయిజ: మండలంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని కట్టకిందితిమ్మప్ప స్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని రాజాపురంలో శనివారం గుంటిరంగనాథ స్వామి జాతర ప్రారంభమైంది. ఆలయ అర్చకులు లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అభిషేకం చేశారు. గంగ పూజ, పల్లకీసేవ, రాత్రి ప్రభోత్సవం నిర్వహించారు.

కట్టకింది తిమ్మప్ప ఆలయంలో కల్యాణ మహోత్సవంలో ఉత్సవ విగ్రహాలు

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

మల్దకల్: ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచి, సంరక్షించాలని ఎంపీడీఓ కృష్ణయ్య సూచించారు. శనివారం మండలంలోని బిజ్వారం, దాసర్‌పల్లి, పావనంపల్లి, పెద్దపల్లి, అమరవాయి నర్సరీలను పరిశీలించారు. నర్సరీలలో మొక్కలను పెంచి హరితహారం నాటికి సిద్ధం చేయాలని నర్సరీ నిర్వాహకులను ఆదేశించారు. అదే విధంగా నర్సరీలలో గతంలో మిగిలి పోయిన మొక్కలను పెద్ద కవర్లలోకి మార్చాలని తెలిపారు.

ఆదిశిలాక్షేత్రంలో న్యాయమూర్తుల పూజలు

మల్దకల్: మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని శనివారం రాత్రి హై కోర్టు న్యాయమూర్తులు సూర్యపల్లి నంద, నాగార్జున సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దరఖాస్తుల వెల్లువ

రాజోళి: మండల తహసీల్దార్ కార్యాలయంలో ముమ్మరంగా దరఖాస్తుల ప్రక్రియ చేపడుతున్నారు. పలు ఉద్యోగాల కోసం అభ్యర్థులకు అవసరమైన ధ్రువపత్రాలను తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, ఆర్ఐ శ్రీనివాస్ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పూర్తి చేస్తున్నారు. వారితో పాటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సోషల్ వెల్ఫేర్ తరపున అందుతున్న కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలను కూడా రెవెన్యూ సిబ్బంది జాప్యం చేయకుండా అందిస్తున్నారు.

అంతర్రాష్ట్ర భజన పోటీలు

అయిజ: మండలంలోని ఉప్పలలో నిర్వహిస్తున్న జంబులేశ్వరి ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శనివారం అంతర్రాష్ట్ర భజన పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం 20 భజన బృందాలు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చాయి. రాత్రి భజన బృందాలు ఆలపించిన భక్తిపాటలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

చైల్డ్‌లైన్ సేవలపై అవగాహన

గద్వాల అర్బన్: బాల్య వివాహాలు, చైల్డ్‌లైన్ 1098 సేవలపై శనివారం జిల్లా కేంద్రంలో దౌదర్‌పల్లి మహిళ, శిశు సంక్షేమ, చైల్డ్‌లైన్ 1098 బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. చైల్డ్‌లైన్ టీం సభ్యుడు కృష్ణ మాట్లాడుతూ బాలల హక్కులు, ఆడపిల్లల రక్షణ, చదువు, వివక్ష, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. పిల్లలు బడికి వెళ్లకుండా ఎక్కడైన పని చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే 1098నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,029

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శనివారం 816 క్వింటాళ్ళ వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.8029, కనిష్ఠంగా రూ. 4240, సరాసరిగా రూ. 6410 ధరలు లభించాయి. అలాగే, 17 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్ఠం రూ. 6419, కనిష్ఠం రూ.6249, సరాసరి రూ. 6419 ధరలు పలికాయి. 25 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్ఠం రూ. 6469, కనిష్ఠం రూ. 5812, సరాసరి రూ. 6250 ధరలు వచ్చాయి. 21 క్వింటాళ్ళ వరి (సోన) రాగా, గరిష్ఠం రూ. 2148, కనిష్ఠం రూ. 1910, సరాసరి రూ. 1910 ధర పలికింది.